# కనబడని నిప్పు

పి.ఎస్.నారాయణ

నేను గుంటూరులో బస్సు దిగేటప్పటికి ఆరు గంటలయింది. వాతావరణం బాగున్నది. హైద్రాబాద్ చలికి అలవాటు పడ్డ నాకు – గుంటూరులో చలి మంటలు వేసుకు కూర్చున్న మనుష్యులను చూస్తే విచిత్రంగా అనిపించింది.

ఊరంతా సంక్రాంతికి స్వాగతం పలుకుతున్నట్లే వున్నది. రోడ్లు శుభ్రంగా



వున్నయి. అటూ యిటూ ముగ్గులు. వాటిమీద గొబ్బెమ్మలు. వాటి చుట్టూ చల్లిన రంగులు. త్రుంచి పోసిన బంతిపూలు.

కానీ నేనిప్పుడు వచ్చింది కళావిహీనమైన శారద మొఖాన్ని చూడటానికి! నాకు ఆమె గుర్తుకు వచ్చినప్పుడల్లా మనస్సు అస్థిమితమౌతున్నది. నిన్న మధ్యాహ్నం ఆఫీసుకు చిరంజీవి ఫోన్ చేశాడు. ''శారద భర్త పోయాడురా... ఒక్కసారి వచ్చి చూచి వెళ్ళగూడదూ!'' అంటూ.

మనస్సు నిలవక వెంటనే రాత్రికే బస్సు ఎక్కేశాను. సావిత్రి 'పండక్కు ఇంట్లో వుండకుండా వెళతారా?' అంటూ విలవిలలాడినా.

శారదకు వచ్చిన కష్టం నన్ను ఒక్క క్షణం కూడా ఆమెకు దూరంగా నిలవనీయలేదు... ఆమె జీవితంలో మరోసారి మోసపోయిందన్నమాట!

మా యింటి పక్కన వున్నది. నాతో కలసి చదువుకున్నది. ఎంత ఆప్యాయంగా పెరిగామూ అంటే మా మనస్సులు విడదీయరాని బంధాలే అయినయి. ఆమె నాకంటే ఒక తరగతి తక్కువ. డిగ్రీలో ఒక సంవత్సరం వెనుక. అంతస్థులో పది మెట్లు దిగువన.

– అదే మమ్మల్ని ఒకటి గాకుండా చేసిందని నాకు తెలుసు. శారదకు తెలుసు. తను 'ఊ' అంటే సర్వం వదిలేసి ఆమెను తీసుకొని పారిపోదామన్నంత దృఢ నిశ్చయంలో కాలిపోతున్న నా మీద బిందెడు నీళ్ళు కుమ్మరిస్తూ – 'అలా చేయడం వలన చాలా కొద్దికాలం మనం సర్వం మరిచి స్వర్గాన్ని చూడవచ్చు... కాని నేను గడుపుతున్న ఈ జీవితంలో నువ్వు జీవితాంతం ఇమడలేవు. నేను పెరిగింది పాత పెంకుటి కొంపలో. అతికొద్ది సౌఖ్యాలనే స్వర్గ సౌఖ్యాలుగా భావిస్తూ – నువ్వు దేవేంద్ర భవనంలో గూడా ఇంకా ఇంకా సౌఖ్యాలు కావాలని తాపత్రయపడుతూ!'' అన్నది.

ఆమె మాటల్లో అర్థం నాకు అర్థమయ్యేటప్పటికి ఆమె ఒక మొగవాడికి ద్వితీయ కళత్రమయి నాకు దూరమయిపోయింది. గుంటూరు వెళ్ళిపోయింది.

ఇది జరిగి ఇప్పటికి ఐదు సంవత్సరాలయింది.

హోటల్ గదిలో బ్రీఫ్‌ను పడేసి, స్నానం చేసి, వేడివేడి కాఫీ త్రాగి, ఎనిమిది గంటలవుతుండగా అరండల్‌పేట చివరలో వున్న బృందావన్ గార్డెన్స్‌లో ఆటో దిగాను. అక్కడ చిరంజీవి వున్నాడు.

నేను వెళ్ళేటప్పటికి వాడు ఆఫీసుకు వెళ్ళే హడావుడిలో వున్నాడు – శారద నాకు ఎంత ఆత్మీయురాలో వాడికి బాగా తెలుసు!

''నేను శారద ఇల్లు చూపిస్తాను నీకు! పలకరించిరా... ఇవాళ ఆఫీసులో నేనో మీటింగ్‌కు అటెండ్ అవ్వాలి... అయిదింటికి నీ హోటల్ దగ్గరకు వస్తాను!''

వాడి కారులో ఎక్కాను. కారు చిన్నగా పోతున్నది.

''శారద భర్తది సహజమైన చావని నేననుకోను!''

''అదేం?'' అథాట్టుగా వాడి వంక తల తిప్పాను.

''లేనిపోని గొడవలతో శారద ఇబ్బందుల్లో పడుతుందని ఆ విషయంలో మాకు అనుమానమొచ్చినా మేం మాట్లాడలేదు! అసలే ఆమె దుఃఖంలో వున్నది... మరిన్ని కష్టాలు ఎందుకు కలిగించాలి!''

నేనా షాక్ నుండి కోలుకోక ముందే శారద వున్న ఇంటి ముందు కారు ఆపాడు చిరంజీవి. నన్ను దించి వాడు వెళ్ళిపోయాడు.

– ఏ శోకదేవతలాగానో వుంటుంది, ఎలా ఓదార్చాలా అని అనుకుంటున్న నేను ఆమె రూపాన్ని చూచి ఆశ్చర్యపోయాను. మామూలుగా వున్నది. చలవచేసిన గులాబీ రంగు పూలున్న తెల్లటి చీర కట్టుకున్నది.

''చాలా కాలమయింది చూచి! గుంటూరులో ఆఫీసు పనా?'' అన్నది ఏ వికారం లేకుండా లోపలకు వెళ్ళగానే. తడబడటం నా వంతయింది.

''చిరంజీవి ఫోను చేశాడు... నిన్ను చూచి వెళ్దామనే వచ్చాను!'' అన్నాను తలవంచుకొని.

ఆమె చటుక్కున తలెత్తింది. ''అయితే పలకరింపులకొచ్చావా!... థాంక్యూ!'' అన్నది పెదిమలు సాగదీసి, విరిచి, కాస్తంత చిరునవ్వును ప్రదర్శిస్తూ.

నేను అవాక్కయ్యాను ఆమె మాట తీరుకు!

* * *

నేను జీవితంలో ఏడ్వాల్సిందంతా ఇంతకు ముందే ఏడ్చేశాను... మొదటిసారి మనిద్దరం పారిపోదామని నువ్వంటే నేను కాదన్నప్పుడు... రెండోసారి ఆయనకు రెండో భార్యగా ఈ ఇంటికి వచ్చినప్పుడు... మూడోసారి ఆయన ద్వారా గర్భం దాల్చినప్పుడు...

''సరే! ఎలాగూ వచ్చావు గదా! నాకో సాయం చేయగలవా?'' అన్నది శారద నేను ఆ యింట్లో కాలు పెట్టిన గంటకు.

గంటయినా ఆమె తల్లి ఏడుపు ఇంకా లోపల నుండి వుండి వుండి వినిపిస్తూనే వున్నది. మధ్యలో శారద అనను గూడా అన్నది. ''భర్త పోయిన నాకంటే అల్లుడు పోయిన ఆమె ఎక్కువగా ఏడుస్తున్నదే అని ఆశ్చర్యపోతున్నావా? ... నేను జీవితంలో ఏడ్వాల్సిందంతా ఇంతకు ముందే ఏడ్చేశాను... మొదటిసారి మనిద్దరం పారిపోదామని నువ్వంటే నేను కాదన్నప్పుడు... రెండోసారి ఆయనకు రెండో భార్యగా ఈ ఇంటికి వచ్చినప్పుడు... మూడోసారి ఆయన ద్వారా గర్భం దాల్చినప్పుడు...'' ఆమె నవ్వుతూ అన్నది.

నేను మొఖం చిట్లించాను. వింతగా ఆమె మొఖంలోకి చూచాను. ఆమెకు మానసిక అస్థిమితత ఏమీ ఏర్పడలేదు గదా!

''మొదటిసారి ఆయన తీయించేవారు. రెండోసారి ఏంచేయాలా అని ఆలోచిస్తుండగానే ఆయన పోయారు!'' మొఖాన్ని చటుక్కున పక్కకు తిప్పుకున్నది.

''ఏమిటి నా సాయం కావాలన్నావ్?'' అన్నాను కాస్త ముందుకు వంగి ఆమె ముఖంలోకే చూస్తూ రెండు నిమిషాల తరువాత.

''ఒకసారి ఆయన పని చేసిన ఆఫీసుకు వెళ్ళి వద్దాం. నాకు వచ్చే డబ్బు ఎంతో తెలుసుకోవాలి... రెండోది నాకు ఆయన బదులు ఉద్యోగమేమైనా ఇస్తారేమో కనుక్కోవాలి... అలాగే జగన్నాథం గారిని కూడా చూసిరావాలి!''

''ఆయనెవరు?''

''నా చచ్చిపోయిన భర్తకు చనిపోయిన మొదటి భార్య తండ్రి!''

''ఆయనతో పనేమిటి?''

'నాకు రావాల్సిన డబ్బుకు ఆయనే అడ్డం పడుతున్నాడని విన్నాను!''

''కూతురు పోయింది కదా ఇంకా డబ్బు దేనికి ఆయనకు?''

''ఆమెకో కొడుకున్నాడు!''

ఆమెనే చూస్తూ వుండిపోయాను.

''ఇవ్వాళ రాత్రికి నేను వెళ్ళిపోవాలి... ఆ విషయం విన్న తరువాత నిన్ను చూడకుండా వుండలేక వచ్చాను. రేపు భోగి, ఎల్లుండి సంక్రాంతి... నేను ఇంట్లో లేకపోతే సావిత్రి బాధ పడుతుంది!''

ఆమె ఒక దీర్ఘ నిశ్వాసం విడిచింది. ''నువ్వు ఈ రోజున రాకపోయినా నీకు ఫోన్ చేసి పిలిపిద్దామనుకున్నాను... నాకు ఈ మనుష్యుల మీద నమ్మకం పోయినా ఒక్క నీవలన కాస్తో కూస్తో మేలు జరుగుతుందనే ఆశ వున్నది ఇంకా!''

నేను మాట్లాడలేదు. ఆమె నమ్మకాన్ని వమ్ము చేయటం నాకిష్టం లేదు.

''నాకు ఇక మిగిలిందల్లా గర్భంలో వున్న పసిగుడ్డే! ఎన్ని విపత్కర పరిస్థితులు వచ్చినా, నాకు ఎవ్వరి సాయమూ లేకపోయినా, నా భవిష్యత్తునంతా ఆ ప్రాణిలో చూసుకోవాలనేదే నా ఆశ!''

* * *

సరిగ్గా పదిహేను రోజులకు తిరిగి గుంటూరులో కాలు పెట్టాను.

క్రితంసారి నేను వచ్చి వెళుతున్నప్పుడు బస్టాండుకు తన కారులో తీసుకువచ్చి నన్ను బస్సెక్కిస్తూ, ''నువ్వు వచ్చి మిగతా విషయాల్లో కల్పించుకోకుండా వుంటే బాగుంటుందేమోరా!'' అన్నాడు చిరంజీవి.

''ఎందుకని?''

''శారద ఇప్పుడు నీ పూర్వపు శారద కాదు... ఆమె భర్త ఒకసారి ఏదో మాటల్లో నాతో అన్నాడు!''

''ఏమని?'' ఆత్రంగా అడిగాడు.

''రెండు సంవత్సరాల క్రితం ఆమెకొచ్చిన గర్భాన్ని తనే స్వయంగా విచ్ఛిన్నం చేయించాడు!''

''కారణం?''

''అది తనవల్ల కాకపోవడంతో!''

నేను బిత్తరపోయాను చిరంజీవి మాటలకు.

''ఇప్పుడు కూడా ఆమె తల్లి కాబోతున్నది... అంటే?'' నేను వడివడిగా అన్నాను.


చిరంజీవి ఉలిక్కిపడ్డట్లుగా నా మొఖంలోకి చూచాడు. ''నిజమా?''

''అవును!'' అన్నాను దృఢంగా. ''శారదే చెప్పింది?''

''అయితే అతడిది ఖచ్చితంగా అసహజమైన చావే!''

''ఎందుకనుకోవాలి అలా అని?''

''శారద భర్త వలన ఎప్పటికీ తల్లి కాలేదు



# బింద్రే ఆరోగ్య రహస్యం

బాలీవుడ్‌తో పాటు టాలీవుడ్‌లోనూ బక్కపలచటి భామగా ముద్రపడి అగ్రహీరోల సరసన నటించిన సోనాలిబింద్రే ఆరోగ్య రహస్యాలు బాగానే వున్నాయి. అందరూ ఏవేవో క్రీములు పూసుకుంటారు నేనుమాత్రం స్పా సెంటరుకెళ్లి వ్యాయామం చేస్తాను. నేను కూడా కొన్ని కంపెనీలను ఆశ్రయిస్తాను.. కళ్లకు మాక్ పెన్సిళ్లు, పెదాలకు డియోర్ మరియు లాంకోమ్, ఎల్ ఓరియల్ షేడ్ గ్లాసెస్.. నా కురులకు మాత్రం ఎల్ ఓరియల్ ప్రొఫెషనల్ ప్రొడక్ట్స్‌ను వాడతాను. ఇవన్నీ ఒకటైతే ఒక బుక్కూ, టీవీ, ఏసీ రిమోట్స్ చేతిలో వుంటే నా అందం మరింత మెరుగవుతూనే వుంటుంది.. అంటోంది సోనాలి బింద్రే.

గనుక!.. ఆమెతో పెళ్ళి కాకముందే అతడు పిల్లలు పుట్టకుండా ఆపరేషన్ చేయించుకున్నాడు!''

నా తల తిరిగిపోయింది ఆ క్షణాన... ఎంతో ఉన్నతంగా భావించే శారదను నేను అంత నీచంగా ఊహించలేను!

శారద ఎదురుగ్గా అనాసక్తంగా కూర్చున్నాను.

''నీ భర్త నువ్వు మొదటిసారి గర్భవతి అయినప్పుడు ఎందుకు ఆ గర్భాన్ని తీయించి వేశాడు?'' అన్నాను ఆమె ఇచ్చిన టీ అందుకుంటూ – ఆ ఇంట్లో కాలు పెట్టిన అరగంటకు.

''ఆయన గారికి మొదటి భార్య కొడుకంటే అంత ఇష్టం!'' పేలవంగా నవ్వింది శారద.

''అయితే?'' నాకు మరొకరు పుడితే ఈ ఎస్టేటు అంతా భాగాలు చేయాల్సి వస్తుందని!''

''అంత ఆస్తి వున్నదా?''

''కాస్తో కూస్తో వున్నది కాబట్టే ఈ ఏడుపు!''

నేను ఖాళీ కప్పును టీపాయ్ మీద పెట్టి ఆమెనే చూస్తూ వుండిపోయాను. ఆమె మాటల్లో దృఢత్వం లేదనిపిస్తోంది.

చిరంజీవి అన్న మాటలు గుర్తుకు రాగా ఆమె మాటల్లో నిజాయితీ కూడా లోపించిందనిపిస్తోంది!

* * *

మరునాడు ఉదయం పదకొండు గంటలప్పుడు నేను శారదను తీసుకొని ఆమె భర్త ఉద్యోగం చేసిన కంపెనీకి వెళ్ళాను అయిష్టంగానే. శారద మీద ఇప్పుడు నాకు జాలి లేదు. ఆమె ఎందుకు ఇలా తప్పుడు పనులు చేస్తున్నదో తెలుసుకోవాలనే తపన ఒక్కటే నాకున్నది. అందుకే ఆఫీసు విషయం తేల్చేసి వీలయినంత త్వరగా ఇక్కడినుంచి వెళ్ళిపోవాలని మనస్సు కోరుకుంటోంది.

''ఆయనకు భానుమూర్తి గారని మంచి మిత్రులున్నారు అక్కడ.. ఆయన్ను కలుద్దాం!'' శారద అన్నది ఆఫీసులో కాలు పెట్టిన తరువాత.

శారదను ఆప్యాయంగా పలకరించారు ఆయన. నన్ను పరిచయం చేసింది.

జాలిగా శారద వంక చూస్తూ, ''నాకు ఈ కంపెనీతో ఇన్ని సంవత్సరాల అనుబంధమున్నా నేనేం సాయం చేయలేకపోతున్నానమ్మా నీకు... ఇప్పుడు ఇండస్ట్రీలన్నీ మూతపడేస్థితిలో వున్నాయి.. ఒక ఉద్యోగి తగ్గినా తగ్గినట్లేనని యాజమాన్యం అనుకుంటున్నది... ఇక డబ్బంటావా! ... అన్నింటిలోనూ రావాల్సినదంతా మొదటి భార్య కొడుక్కే చెందాలి అన్నట్లుగా నామినేషన్ వున్నది!'' అన్నారు నిస్సహాయంగా. ''లేదా కోర్టుకు వెళితే ఏమైనా భాగం రావచ్చేమో కానీ అది అంత త్వరగా తేలుతుందని నేననుకోను!''

''మా వారి మిత్రులు చిరంజీవి గారు మీ ఎమ్డీకి గూడా మంచి పరిచయస్థులే కదా!'' ఎలాంటి భావనా లేకుండా ఆయన్ను చూస్తూ అన్నది.

నేను విచిత్రంగా శారద మొఖంలోకి చూశాను.

''ఎవరు ఎంత పరిచయస్థులైనా చనిపోయిన మనిషి రాసిన సంతకాలు పెట్టిన కాగితాలను మార్చలేరు కదా!''

''అవునులేండి.. ఇప్పుడు ఎవ్వరూ ఏమీ చేయలేరు!'' చాలా నిర్లిప్తంగా అంటూ లేచి నిలబడింది. ఆ మాటలు అంటున్న ఆమె కంఠం వణుకుతుండటం నేను గమనించాను. అది కోపంతోనో, అసహనంతోనో అర్థం కాలేదు.

మేం బయటకు వచ్చిం తరువాత నేనే అన్నాను ''చిరంజీవిని కలుద్దామా?''

''దేనికి?'' విసురుగా అన్నది.

నేను నిగ్రహించుకున్నాను. ''ఇక్కడ వుండే మనిషి... అతడు నీకేమైనా సాయం చేయగలుగుతాడేమోనని – వాడు నాకూ బాగా తెలుసు గదా!''

శారద నడి రోడ్డుమీదే ఫక్కున నవ్వింది. ''ఇప్పటికే నాకెంతో సాయం చేశాడు.... ఇంకా శ్రమ పెట్టడం దేనికి?!''

అతడు ఆమెకు ఏం సాయం చేశాడో నాకు అర్థం కాలేదు. ఇంటికి వెళ్ళిన తర్వాత, ''నేను రాత్రికి వెళ్ళిపోతాను... వుండి నేను చేయగలిగిందేమున్నది?'' అన్నాను.

''సరే! ఎవ్వరూ ఏమీ చేయలేరని నాకు తెలుసు... ఆయన వున్నంత వరకూ స్వంత ఇల్లనే అనుకుంటున్న ఈ ఇల్లు కూడా ఎవరికి చెందాలని రాశారో నాకు తెలియదు.. రేపు జగన్నాధం గారు వచ్చి ఖాళీ చేయమంటే మరో గూడు ఎక్కడ చూచుకోవాలో తెలియకుండా వున్నది'' అన్నది తల వంచుకొని. ''మాయింటి పరిస్థితి నీకు తెలిసిందే గదా... అమ్మే అన్నయ్యల దయా దాక్షిణ్యాల మీద బ్రతుకుతున్నది!''

నిజమే అవ్వవచ్చు కాని నేను మాత్రం చేయగలిగిందేమున్నది! ఆమె నాకు ఒకనాడు ఎంతో ఆత్మీయురాలైన వ్యక్తే. అదృష్టం కలిసివచ్చి వున్నట్టయితే నాయింట నాతో ఆనందంగా వుండి వుండేది.

''నీకింకెవ్వరూ తెలిసిన వాళ్ళు లేరా?'' కళ్ళు చిట్లించి ఆమెనే చూస్తూ అడిగాను

ఆమె పతనమవ్వటానికి కారణం తెలుసుకోవాలనే ఆకాంక్ష నన్ను అలాంటి ప్రశ్నను అడిగించింది.

''నాకు ఈ ప్రపంచంలో అందరూ తెలిసినవాళ్ళే – అవసరానికి ఆదుకునే వాళ్ళు నిన్ను మించి మరెవ్వరున్నారు?'' ఆమె భర్త పోయాడని తెలిసి నేను వచ్చిన తరువాత మొట్టమొదటిసారిగా ఆమె కళ్ళు తడవటం గమనించాను.

''నిన్ను ఆదుకునేవాడు... నీకు అత్యంత ఆత్మీయుడు మరెవ్వరూ లేరా?'' నేనా మాటను చాలా కటువుగా అన్నాను. నాలోని ఆమె మీద అసహ్యాన్నంతా ఆ మాటలకు పులిమి.

''నేను అక్కడా మోసపోయాను... నన్ను దగా చేసి నా భర్త ఆత్మహత్య చేసుకుంటాడని నేనెప్పుడూ అనుకోలేదు''

ఆమె భర్తది సహజమైన చావు కాకపోవచ్చు అన్న చిరంజీవి మాటలకు ఇప్పటికి ఋజువు దొరికింది. దోషి శారదేనన్నమాట!

''దగా చేశా.. లేక నిన్ను భార్యగా భరించలేకనా!'' నా కంఠం మరింత కఠినమయింది.

– బుడగ పగలక ముందు అందంగా వుంటుంది. పగిలింతరువాత శూన్యమే! – శారద ఇప్పుడు పూర్తిగా నాకు పరాయి మనిషి!

* * *

''కదలకుండా అయిదు నిముషాలు కూర్చో..

ఇప్పుడే వస్తాను!'' నేను లేస్తుండగా శారద అన్న మాట అది.

నాకు ఇక అక్కడ వుండబుద్ధి కాలేదు. వెంటనే హోటల్‌కు వెళ్ళి సంచీ తీసుకుని హైదరాబాద్‌కు వెళ్ళిపోవాలని మనస్సు ఆరాటపడుతోంది.

''నాకిప్పుడు కాఫీలు, టిఫిన్లు వద్దు!'' ఎంత అదుపులో పెట్టుకున్నా మాటల్లో చిరాకు ఆగడం లేదు.

''నువ్వెందుకో కోపంగా వున్నావనిపిస్తోంది.. నావలనా?''

''నాకు ఎవ్వరిమీదా కోపం లేదు!'' మొఖం ముడుచుకుంటూ అన్నాను.

ఆమె లోపలకు వెళ్ళిపోయింది.

నేను ముళ్ళమీద కూర్చున్నట్లుగా కూర్చున్నాను ఆమె రాక కోసరం.

ఆమె బయటకు వస్తూనే నా చేతిలో ఒక కాగితం పెట్టి, ''ఇది చదువుతుండు.. ఈలోగా కాఫీ తెస్తాను... త్రాగి వెళ్ళిపోదువుగాని.. ఎందుకంటే నీ వాలకం చూస్తే నువ్వు మరోసారి నా గుమ్మం తొక్కేలా లేవు!'' అంటూనే మెరుపులా లోపలకు మాయమయింది.

నేను ఒక్క క్షణమే ఆమె ముఖంలోకి చూచింది. అది ఎర్రగా కందగడ్డలా వున్నది. కళ్ళు చింత నిప్పుల్లా వున్నాయి. ఆమె ఏ విషయంలోనో కుతకుతలాడిపోతున్నట్లుగా వణికిపోతున్నది.

ఆమె వెళ్ళినవైపే విచిత్రంగా చూస్తూ ఆమె యిచ్చిన కాగితపు మడత విప్పాను.

''శారదా, నేనో చిక్కు సమస్యలో గొంతు వరకు కూరుకుపోయాను. నా మొదటి భార్య తండ్రి నా ఆస్తంతా తన మనమడికే దక్కాలనే ఆశతో మన వివాహానికి ఎన్నో అడ్డంకులు ఏర్పరిచాడు. చివరకు నీకు పిల్లలు పుట్టకుండా నేను ఆపరేషన్ చేయించుకోవాలని నా గొంతుమీద కత్తి పెట్టాడు. నేను ఆరోజున ఏదోవిధంగా ఆయన నుండి బయటపడాలని, ఆసుపత్రిలో ఓ పూట వుండి ఆయన మొఖాన ఓ దొంగ సర్టిఫికెట్ పారేసి నిన్ను వివాహం చేసుకున్నాను. అదే ఈనాడు నా పాలిట ఉరిత్రాడయింది.

వాళ్లతో నాకెన్నడూ సఖ్యత లేదు. నా మొదటి భార్యతో సంసార జీవితాన్ని కూడా ఆనందంగా గడపలేకపోయాను. అందుకే ఆమె పురిటిలోనే పోవడం నాకు పెద్దగా బాధ కలిగించలేదు. అది గతం.

ఇక ప్రస్తుతానికి వస్తే – నీ మొదటి గర్భం సంగతి ఆయన పసిగట్టి నేనిచ్చిన ఆ కాగితాన్ని ఆయుధంగా చేసి నీ మీద దుష్ప్రచారం చేయ సంకల్పించాడు. మన పరువును, అందునా నీ పరువును కాపాడటం భర్తగా నా బాధ్యతగా తలచి నీ ఇష్టానికి వ్యతిరేకంగా ఆ హేయమైన పనిని చేయించాను.

మరోసారి గర్భవతిని అయినానని నువ్వు భయం భయంగా చెప్పినప్పుడు నాకు ఏం చేయాలో పాలుపోలేదు. ఈసారి కూడా క్రూరంగా ప్రవర్తించి, ఇక ఎప్పటికీ నువ్వు తల్లివి అయ్యే అవకాశం లేకుండా నిజంగా ఆపరేషన్ చేయించుకుందామా అని ఆలోచించాను. కానీ నీకు అన్యాయం చేయటం నాకిష్టం లేకపోయింది. అందుకే.. నేను లేకపోతే ఇక నీకీ కష్టాలు వుండవు కదా అనే ఉద్దేశంతో నన్ను నేనే అంత మొందించుకోవటానికి నిర్ణయించుకున్నాను.

తల్లివయి, పుట్టబోయే వాళ్ళలోనే నీ భవిష్యత్తును మలుచుకో.

నేను నీకు అన్యాయం చేస్తున్నానని నువ్వనుకుంటే క్షంతవ్యుడిని. నన్ను మన్నించు.''

నేను అథాట్టుగా తలెత్తాను. తలవంచుకుని శారద ఎదురుగ్గా నిలుచొని వున్నది. ఇందాకటిలా ఆమె దుర్గలా లేదు. ఓ పవిత్ర స్త్రీలా విలపిస్తున్నది. నేను సిగ్గుతో కుంచించుకుపోయాను. నాకు ఆమె ముందు కూర్చోవటానికి చాలా చిన్నతనమనిపించింది. నాకు తెలిసిన శారదను లోకుల మాటలు నమ్మి ఎంత నీచంగా ఊహించుకున్నాను.

''జగన్నాథం ఇంటి అడ్రసు చెప్పు!''

''ఆయన్ను చంపేద్దామనా?'' అంత దుఃఖంలోనూ నవ్వింది. ''ఆయనకు మీ ఆత్మీయ మిత్రుడు చిరంజీవి చాలా ఇష్టుడు... ఆయన ఎంత చెబితే అంత!'' ఎందుకనో చిరంజీవి అంటే ఆమె మాటల్లో స్పష్టంగా అయిష్టత వ్యక్తమవుతోంది.

ఆమె ఏ ఉద్దేశ్యంతో అన్నా – ఈ ఊర్లో వుండేవాడు కాబట్టి... అవసరమొస్తే ఒకటికి రెండుసార్లు తిరిగే అవకాశమున్నది గనుక వాడినే తీసుకువెళ్ళటం ఉత్తమమని వాడింటికి వెళ్లాను.

వాడు ఇంట్లో లేడు. అత్యవసరంగా ఆఫీసు పని మీద విశాఖపట్నం వెళ్ళాడట. రెండు రోజుల తర్వాత వస్తాడని చెప్పింది వాడి భార్య.

నేను ఆలస్యం చేయదలచుకోలేదు. టైం చూస్తే ఆరు గంటలయింది. ఒక గంటలో జగన్నాథం గారిని కలిసి మాట్లాడి రాత్రి హైదరాబాద్ బస్సెక్కెయ్యాలి. తరువాత చిరంజీవికి చెప్పి అవసరమొస్తే వాడి సాయం కోరవచ్చు!

''జగన్నాథం గారు వుండేది బ్రాడీపేటలోనే. నేను ఆటోలో వాళ్ళింటికి వెళ్ళేటప్పటికి ఏడు గంటలయింది.

''నా పేరు సత్యం! నేను హైదరాబాద్ నుండి వచ్చాను.. శారద మాకు బంధువు!'' బంధువు అని చెబితే కాస్త బలంగా వుంటుందని చెప్పాను. బంధువు కాకపోయినా ఆమె నాకెంతో కావాల్సిన మనిషనేది నిస్సందేహం!

''ఏ విషయంలో వచ్చారు?'' ఆయన మొఖం చిట్లించాడు.

''ఆమె కేమైనా మీరు సాయం చేయగలుగుతారేమోనని!'' ఆయన ఎదురుగ్గా కూర్చుంటూ అన్నాను.

''ఎలాంటి సాయం?''

''ఆమె భర్త చనిపోయిన తరువాత వచ్చే డబ్బంతా మీ మనమడి పేరునే రాసినట్లుగా వున్నది... కంపెనీ వారా ఆమెకు ఉద్యోగం ఇచ్చే ఉద్దేశ్యంలో లేరు... ఒకవిధంగా – మీ అల్లుడి భార్యగా – ఆమె మీకు కూతురు లాంటిదే.. జీవితం వెళ్ళబుచ్చటానికి కొంత ధనం వుండాలి కదా!''

'నా వెనకాలా ఆస్తి ఏమీలేదు... పిల్లవాడికి అయిదేళ్ళు నిండినయ్యేమో ... నేను పోయింతర్వాత వాడు రోడ్డుమీద పడే స్థితి.. ఇంకా ఆమెను పోషించే శక్తి నాకెక్కడిది!''

''ఆమె తల్లి కాబోతున్నది!'' అన్నాను ఆయన కళ్ళలోకి సూటిగా చూస్తూ. ''ఈ ఆస్తిలో భాగం ఆమెకు, పుట్టబోయే వాళ్ళకు కూడా న్యాయపరంగా చెందుతుంది!'' అన్నాను కాస్త కంఠం హెచ్చించి.

ఆయన మామూలు మాటలకు లొంగే మనిషి కాదని అర్థమయింది!

ఆయన చటుక్కున లేచి నిలబడ్డాడు. ''ఆమె బంధువునని చెప్పుకోవటానికి నీకు సిగ్గు వేయటం లేదూ!... ఆమె జాణ... నీతి లేని మనిషి... నా మనవడికి తల్లే లేదు.. ఇప్పుడు తండ్రిని కూడా లేకుండా చేసింది ఆ మహాతల్లి... మీరు అడక్కుండానే – ఆమెను కటకటాల వెనక్కు పంపకుండా సాయం చేయనే చేశాను.. ఇంకా మీరు కోరినట్లుగా చేసి పసివాడికి అన్యాయం చేయలేను! చేయను!''

అప్పుడే బయటనుంచి ఓ పిల్లవాడు – తొడుక్కున్న లాగును పైకి లాక్కుంటూ ''తాతా!'' అంటూ పరుగెత్తుకుంటూ వచ్చి ఆయన వళ్ళో వాలాడు.

వరండాలో వెలుగుతున్న ట్యూబ్‌లైటు కాంతిలో ఆ పిల్లవాడి మొఖం స్పష్టంగా కనబడుతున్నది నాకు. తరచి తరచి చూచాను. కళ్ళు చిట్లించి చూచాను... అలా చూస్తుంటే నాకు ఒళ్ళు గగుర్పొడిచింది...

శారద వైవాహిక జీవితం నాశనమవ్వటానికి కారకుడెవ్వరో నాకు స్పష్టంగా అర్థమయింది – బాస్టర్డ్!

... ఆ పిల్లవాడి మొఖం అచ్చం చిరంజీవి మొఖంలాగానే వున్నది.

★

## ఆ తరం... మధురం...

సినిమా స్క్రీన్‌ప్లేకు ఒక బైబిల్‌లా, ఒక ఖురాన్‌లా, ఒక భగవద్గీతలా చెప్పుకునే 'మాయాబజార్' సినిమా సృష్టికర్త కె.వి. రెడ్డిగారు తొలినాళ్లలో వాహినీ సంస్థలో ప్రొడక్షన్ మేనేజర్‌గా పనిచేసేవారు. అంచేత... నటీనటులను టైముకు షూటింగ్‌కు తీసుకురావలసిన బాధ్యత మరి ఆయనదే కదా... ఒకసారి అనుకున్న సమయానికి ప్రొడక్షన్ కారు రాలేదు. ఆ సినిమా కథానాయకుడు చిత్తూరు నాగయ్యను మేకప్‌మాన్ హరిబాబు దగ్గరకు తీసుకెళ్లాలి. ఆలస్యమైపోతోంది. కె.వి. వెంటనే తన సొంత సైకిల్ తీసుకుని నాగయ్య ఇంటికి వెళ్లారు. ఆయన్ని కూచోబెట్టుకుని తనే సైకిల్ తొక్కుకుంటూ మొత్తానికి సకాలంలో నాగయ్యను హరిబాబు ముందు నుంచోబెట్టారు. అప్పట్లో తారలకు స్వంత మేకప్‌మెన్‌లంటూ వుండేవారు కాదు. ఎంత పెద్దతార అయినా కంపెనీ మేకప్‌మాన్ ముందు బుద్ధిగా మొఖం అప్పగించి కూచోవలసిందే. వృత్తి నిబద్ధత అంటే మరది. ఇప్పుడో అంతా హళ్లా పెళ్లలే...

సేకరణ: కౌముది